క్లుప్తంగా

క్రీడాకారులకు చేయూత ఇవ్వండి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు చేయూతనందించాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య నాయకులు కోరారు. గురువారం విశ్వవిద్యాలయంలో ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి పతకాలు సాధిస్తున్న క్రీడాకారులకు ప్రాక్టీస్ సమస్యలు ఉన్నాయని, సాధన చేయాలంటే ప్రత్యేక మెనూ, పౌష్టికాహారం అందించాల్సి ఉందన్నారు. అదే విధంగా క్రీడాకారులకు తరగతులకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని కోరారు. అధికారులు స్పందించి ప్రతిభగల క్రీడాకారులకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నాయకులు భార్గవ్ రెడ్డి, వినోద్, అరవింద్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: దళితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మునెయ్య కోరారు. గురువారం ఈ మేరకు కలెక్టర్ లోతోటి శివ శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునెయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మీటింగ్ జరిపి దళితుల సమస్యలపై చర్చించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపామన్నారు. బద్వేలు జెడ్పీ హైస్కూల్‌లో వాచ్‌మెన్‌గా సుధాకర్‌ను విధులలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నగర నాయకులు చంద్రగుప్త, బద్వేల్ దళిత నాయకులు కె. బాబురావు, నారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: కడపలో 13వ వార్డు బ్రాహ్మణ స్ట్రీట్‌లోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పేపర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది ఆగస్టు 1వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కడప టౌన్ బుక్ సెల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మైలవరపు జగదీష్, అధ్యక్షులు కుంజేటి శ్రీనివాసరావు, సెక్రటరీ కొమ్మూరి కిరణ్, ట్రెజరర్ సుమన్, రాష్ట్ర పేపర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వంకదరి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆయేషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, స్పెల్ – బీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులందరికీ నోట్ బుక్స్, పెన్ను, పాడ్ అందజేశారు.

కేరళ మృతులకు సంతాపం

కడప కల్చరల్ : కేరళ విలయంలో ప్రాణాలు కోల్పోయిన వారికి పలు స్వచ్ఛంద సంస్థలు సంతాపం వ్యక్తం చేశాయి. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అధ్యక్షులు అనంతబొట్ల వెంకట సుబ్బయ్య, పాస్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నప రెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, కోశాధికారి దేవతి రవి, సహ కార్యదర్శి బాష, మాజీ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి గురువారం సంస్థ కార్యాలయంలో కేరళ మృతుల పట్ల సంతాపం వ్యక్తం చేశారు. లయన్స్ ప్రతినిధులు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రొద్దుటూరు : శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు రోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు కార్యక్రమం ఉంటుందని స్వామినీ శివదర్శనానంద సరస్వతి మాతాజీ తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో గురువారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని శివదర్శనానంద సరస్వతి మాతాజీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాతాజీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఆధ్యాత్మికంగా నవడం ద్వారా ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా జీవనం సాగించవచ్చన్నారు. యోగా, ధ్యానం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగ, ధ్యానం ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. అన్నింటి కన్నా ఆరోగ్యం ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బిరెడ్డి, నారాయణరెడ్డి, మునిశేఖర్ రెడ్డి, సోమశేఖర్ రావు, రామగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెన్నమ్మ పరవళ్లు

కడప కార్పొరేషన్: భారీ వర్షాల కారణంగా నాగార్జున సాగర్ నుంచి అధిక మొత్తంలో నీటిని శ్రీశైలం జలాశయానికి వదులుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో పెన్నానదికి కూడా వరదనీటిని వదిలారు. దీంతో పెన్నమ్మ వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. ధాన్యాల తర్వాత పంటలు వేసుకునే సమయానికి పెన్నాకు వరద రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చుట్టూ కొండలు, హొయలొలుకుతూ సాగుతున్న పెన్నమ్మ.... రెండు ఊళ్లను కలిపే వంతెన... చెన్నూరు సమీపంలోని వంతెన మీద నుంచి చూస్తే ఈ దృశ్యాలు ముగ్ధ మనోహరంగా కనిపిస్తున్నాయి.

తీర్పును స్వాగతిస్తున్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : సుప్రీం కోర్టు గురువారం వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ రవీంద్రనగర్ మండలం అధ్యక్షులు యాపమాని హరినారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని మాదిగజాతి ముద్దుబిడ్డలకు ఇది మరువని రోజని, ఎన్నో దశాబ్దాలు పోరాటం చేస్తున్న మాదిగలకు ఊపిరి పోసిన రోజన్నారు. విద్య, ఉద్యోగ పరంగా మాదిగల ఎదుగుదలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎన్నో దశాబ్దాలుగా వేచి ఉన్న మాదిగలకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సుప్రీం కోర్టు 6:1 నిష్పత్తితో వెలువరించిన స్పష్టమైన తీర్పును ఆధారం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఎస్సీ వర్గీకరణ చేపట్టి వెంటనే అమలులోకి తీసుకు రావాలని కోరారు.

నేటి నుంచి చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు పడమటి వీధిలో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం నుంచి అమ్మవారి 95వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు స్థానిక సరస్వతి నగర్‌లో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి అమ్మవారి ఆషాఢ మాస చీరే సారె కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు గాజులు టెంకాయలతోపాటు చీర, జాకెట్, పూజా సామగ్రితో ఉదయం 8.30 నిమిషాలకు వెంకటేశ్వర స్వామి దేవస్థానం దగ్గరికి రావాలన్నారు. ఇక్కడి నుంచి చౌడేశ్వరిదేవి ఆలయం వరకు వెళ్లాలన్నారు. అలాగే 4వ తేదీ ఆదివారం అమ్మవారి 95వ జయంతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకాలకు ఆహ్వానం

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి నియామకాలు చేపడతారని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. కళాశాల కార్యాలయంలో శుక్రవారం, 5వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్ (1), కామర్స్(1) సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం ఉత్తీర్ణత ఉన్నవారు అర్హులన్నారు. మాస్టర్ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత, నెట్, సెట్ కలిగిన వారికి ద్వితీయ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకి హాజరు కావాల్సిన వారు సంబంధిత విద్యార్హత పత్రాలతో హాజరు కావాలన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

పులివెందుల టౌన్ : ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆయన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ పీఓ శ్రీనిత తదితరులు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎలక్షన్ డ్యూటీలో పాల్గొన్న వలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల వ్యవసాయ శాఖ ఏడీఏగా ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : స్థానిక వ్యవసాయశాఖ డివిజన్ ఏడీఏగా గురువారం అంబవరం ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం అంబకపల్లె రోడ్డులోని మినిసెక్రటేరియట్‌లో ఉన్న వ్యవసాయశాఖ డివిజన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల డివిజన్ ప్రాంతంలో వ్యవసాయంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు.

ప్రధానోపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న మున్సిపల్, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఇతర అన్ని క్యాడర్ల ఖాళీలను ప్రమోషన్ల ద్వారా వెంటనే భర్తీ చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రతి నెలా ప్రమోషన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధ నేతర కార్యక్రమాల నుంచి విముక్తి కల్పించాలన్నారు. అలాగే జీవో 117 రద్దు చేయాలని, పాఠశాల నిర్వహణ కోసం అవసరమయ్యే పాఠశాల గ్రాంటును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యద ర్శులు ఆలమూరు ప్రసాదు, చంద్రశేఖర్, విద్యాసాగర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

నిబంధనల ప్రకారం ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించాలని కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి, కడప మండల ఎంఈఓలు గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్ ఆదేశించారు. గురువారం కడప జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కడప మండల పరిధిలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల వారికి పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన జరగనున్న ఎస్ఎంసీ ఎన్నికలను ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఎన్నికల షెడ్యూలు ప్రకారం ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఏ పాఠశాలలో అయినా ఎన్నికలు సమస్యాత్మకంగా జరుగుతాయని అనుమానం ఉంటే ముందుగా సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ ఎన్నికలకు సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపధ్యాయులు, మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి

వసతి గృహాలలో మెరుగైన వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలు అధ్వాన్నంగా ఉన్నాయని, కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు కడప కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ వసతి గృహ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆయన వాపోయారు. పెండింగ్‌లో ఉన్న హాస్టల్ విద్యార్థుల కాస్మోటిక్, మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో హాస్టల్ వార్డెన్‌ల కొరత ఉందని, ఒక్క వార్డెన్ మూడు హాస్టళ్లకు ఇన్చార్జి వార్డెన్ గా ఉండడం వల్ల విద్యార్థులకు అందవలసిన పౌష్టికాహారం అందడం లేదని, భద్రత లోపించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో దాదాపు 50శాతంకు పైగా వసతి గృహాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. దీనివల్ల విద్యార్థులకు సరైన మౌలిక వసతులు సమకూరడం లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారికి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటు పడదామని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీ మాదకద్రవ్యాల నిర్మూలనపై ముద్రించిన పోస్టర్స్‌ను కడపలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు, మాదకద్రవ్యాల వంటి వాటి జోలికి వెళ్లవద్దని, వాటికి దూరంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇప్పటికే జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ యు. వెంకటకుమార్, నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయ్ తెలిపారు. గురువారం కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. ఇలా పాలు తాపించడం వలన తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధు మేహం రాకుండా ఉంటుందన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్ఠమన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పెద్ద చెప్పలి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ మాహినూర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు.



కమలాపురంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణి, బాలింత మహిళలకు తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. అలాగే పీహెచ్‌సీ హెచ్‌ఈ షఫీఉన్నీసా మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తిలక్ సేవలు స్ఫూర్తిదాయకం

ఏఎఫ్‌యూ: భారత జాతీయ ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించిన గొప్ప నాయకుడు బాలగంగాధర్ తిలక్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని భావించి పోరాటపంథాను ఎంచుకున్న నాయకుడు అని కొనియాడారు. ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే మంచిపౌరులుగా మార్చవచ్చని భావించడంతో పాటు భారతీయ సంస్కృతి గురించి, భారతదేశ ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశించారన్నారు. మొట్ట మొదటిసారిగా శివాజీ ఉత్సవాలు, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించి జాతీయ ఉద్యమంవైపు నడిపించేలా చేశారన్నారు. ఆయన ఆదర్శ జీవితం, పోరాటం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నేషనల్ ఈవెంట్స్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు

పని చేయని ఆధార్ సెంటర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో దాదాపు ఆరు నెలల నుంచి ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం కాబట్టి జిల్లా నలుమూలల నుంచి ఆధార్ నమోదుకు చిన్న పిల్లలను తీసుకొని వచ్చిన తల్లిదండ్రులు తిరిగి వెనక్కి వెళుతున్నారు. ఆధార్ కేంద్రం మొదట్లో బాగా నడిచినప్పటికీ రాను రానూ యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ఆధార్ సెంటర్ పని చేయడం లేదు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి ఆధార్ సెంటర్ యధావిధిగా పని చేసే విధంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో పని చేయని ఆధార్ కేంద్రం

పోటీ ప్రపంచంలో నైపుణ్యతకు ప్రాధాన్యం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ డా.జి. రవీంద్రనాథ్, అధ్యాపకులు

వైవీయూ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలకు ప్రాధాన్యత పెరిగిందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కళాశాల వాణిజ్యశాస్త్రశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీతో పాటు అదనపు నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. జీఎస్టీ లాంటి చక్కటి కోర్సు ను అందుబాటులోకి తీసుకువచ్చిన వాణిజ్యశాస్త్రశాఖను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డా. కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థి కేంద్రీకృతంగా బోధన సాగాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి కేంద్రీకృతంగా విద్యాభ్యాసన సాగినప్పుడే ప్రతి విద్యార్థి విద్యలో సులభంగా రాణించగలరని కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి, కడప మండల ఎంఈఓ-1 గంగిరెడ్డిలు సూచించారు. గురువారం కడప నగరం ముత్తరాసుపల్లి జెడ్పీ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల హెచ్‌ఎం పద్మావతమ్మ, దేవసేన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు జూలై నెల వరకు చెప్పిన సిలబస్ గురించి ఆరా తీశారు. విద్యార్థులకు విద్యాకిట్లు అందాయా లేదా ఇంకా తక్కువేమైనా వచ్చాయా అని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత బాగుండాలన్నారు.

ఆర్డీ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు

కడప రూరల్: వైద్యారోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వై శ్రీనివాసులును గురువారం స్థానిక కార్యాలయంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆదాల వెంగళరెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అహరోన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో పలువురు వైద్య ఉద్యోగ సంఘాల నేతలు ఉన్నారు.

గండికోట అభివృద్ధికి సహకరించండి

కడప కల్చరల్ : వైఎస్ఆర్ జిల్లాలోని గండికోట అభివృద్ధికి మీవంతు సహకారం అందజేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కేంద్ర పురావస్తుశాఖ అధికారికి విన్నవించారు. ఆ శాఖ డైరెక్టర్ జనరల్ ఎదువీర్‌సింగ్ రావత్‌ను న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. గండికోట అభివృద్ధి జరిగితే దేశానికి మంచి పేరు లభిస్తుందని, దాన్ని యునెస్కో కట్టడాల జాబితాలోకి చేర్చాలని కోరుతూ తాము ఉద్యమించినట్లు ఆయన వివరించారు.